ప్రజాశక్తి
శనివారం 11 మార్చి 2023
5
అనంతపురం

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

## నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ: కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలోని డీపీఆర్సీ భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పోలింగ్ జరిగేలా చూసే బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉంటుందన్నారు. పోలింగ్ నిర్వహణలో ఏదైనా సమస్య గుర్తిస్తే వెంటనే ప్రిసైడింగ్ అధికారితో చర్చించి సవరణలు చేసుకునేలా చూడాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి మార్చి 13న ఉదయం 7 గంటల లోపే చేరుకోవాలని, ప్రీపోలింగ్ సమయంలో చేపట్టే సన్నాహక కార్యక్రమాలతోనే సూక్ష్మ పరిశీలకుల పని ప్రారంభమవుతుందన్నారు. అవాంఛిత కార్యక్రమాలు చోటుచేసుకున్న సమయంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర మరింత కీలకం అవుతుందని, వారిచ్చే నివేదిక ఆధారంగా ఎన్నికల కమిషన్ తదుపరి నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా ఎలక్షన్ కమిషన్ గమనిస్తూ ఉంటుందని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో అప్రజాస్వామిక పద్ధతులను చూసీచూడనట్టు వ్యవహరించే అబ్జర్వర్లపై చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజ రావు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

**రేపు ఎన్నికల సామగ్రి అందజేత**

ఆదివారం ఉదయం జేఎన్టీయూలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వర్సిటీలో ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి వితరణ, కౌంటింగ్ కోసం చేపడుతున్న ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. సామగ్రి అందజేతకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారీగా కౌంటర్ల ఏర్పాటు, సిబ్బందికి భోజన వసతి, రవాణా, వర్సిటీ ఆవరణంలో పార్కింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ రూములను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూములను నలువైపుల నుంచి నిరంతరం గమనించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా పర్యాటక అధికారి నాగేశ్వరరెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్అండ్‌బి ఈఈ ప్రసాద్ రెడ్డి, ఆర్టీవో సురేశ్ నాయుడు పాల్గొన్నారు.

# 'కట్ట'లు తెంచుకుంటున్నాయ్..!



- ఓటుకు నోటు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- తాడిపత్రిలో ఆన్‌లైన్‌లో పంపిణీ చేసిట్టు గుర్తింపు
- తక్కిన చోట నేడు, రేపు పంపిణీకి ఏర్పాట్లు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

మండలి పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. నేటి సాయంత్రంతో ప్రచారాలూ ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నోట్ల కట్టలు సిద్ధమవుతున్నాయి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బుల 'కట్టలు'తెంచుకుంటున్నాయి. సిద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటుకు ఐదువేలు, పట్టభద్రులకు ఓటుకు మూడు వేల చొప్పున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు గుట్టుగా సాగిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు ఆయా పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లను ఇప్పటికే గుర్తించినట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఉంటున్న ముఖ్య నేతల ఇళ్లకు డబ్బులు చేరినట్టు సమాచారం. పోలింగ్ తేదీకి ముందు రోజు పక్కాగా డబ్బులు పంపిణీనికి సిద్ధం చేసారన్న ఆరోపణలున్నాయి.

మండలి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులకు టిఫెన్ బాక్సులివ్వడం పెద్ద దుమారం రేపింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని బహుమతులు కాకుండా నేరుగా క్యాష్ రూపంలోనే పంపిణీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. దీంతోపాటు అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులు అధికార బలాన్ని వినియోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతకు మునుపు ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలతో మాట్లాడటమే కాకుండా ఎన్నికల్లో వారు పనిచేసే విధంగా ఒత్తిడి చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రయివేటు స్కూల్ యాజమాన్యాల సంఘానికి సంబంధంచిన ఒక వ్యక్తి కూడా ప్రయివేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను అధికారపార్టీకి అనుకూలంగా ఓటింగ్ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**తాడిపత్రిలో ఆన్‌లైన్‌లో పంపిణీ చేసినట్టు గుర్తింపు**

తాడిపత్రిలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు డబ్బులు పంపిణీ చేసినట్టు ఆరోపణలు రావడమే కాకుండా పోలీసులు దీనిపై ఆరా తీయడం చర్చనీయాంశం అవుతోంది. స్వతంత్ర అభ్యర్థిగానున్న చామల అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ఎస్‌బిఐ సర్వీసు కేంద్రం నుంచి కొంత మందికి నగదును ట్రాన్స్‌ఫర్ చేసారన్న ఆరోపణలు రావడంతో తాడిపత్రి పోలీసులు ఆ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయనకు సంబంధించిన సిపియు, మానిటర్‌ను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

**పశ్చిమ రాయలసీమ పరిధిలో ఓటర్లు ఇలా...**

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 330124మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కర్నూలు జిల్లాలో 61633, నంద్యాలలో 54929 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 68341 మంది ఓటర్లు ఉన్నారు. సత్యసాయి జిల్లా 43310, వైఎస్ఆర్ 81317 మంది ఓటర్లు ఉండగా, అన్నమ్య జిల్లాలో 20594 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కర్నూలు జిల్లాలో 5391 మంది ఓటర్లు, నంద్యాలలో 4426, అనంతపురం జిల్లాలో 5564 మంది ఓటర్లు, సత్యసాయి జిల్లాలో 3348 మంది ఓటర్లు, వైఎస్ఆర్ జిల్లాలో 7461 మంది ఓటర్లు, అన్నమయ్య జిల్లాలో 1958 మంది ఓటర్లు ఉన్నారు.

డబ్బులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు రావడంతో తాడిపత్రిలోని ఓ ఎస్‌బిఐ సర్వీసు కేంద్రంలో విచారణ చేస్తున్న పోలీసులు

ఓటర్లకు నగదు బదిలీకి సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు ఎస్‌బిఐ సర్వీసు కేంద్రం నుంచి కంప్యూటర్‌లను తీసుకెళ్తున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్పీ డా॥ ఫక్కీరప్ప

## 'హవాలా' దోపిడీ..!

### అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

హవాలా డబ్బును తరలించే ముఠాలపై మాటువేసి దారి దోపిడీలకు పాల్పడే ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఈ ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.89 కోట్లు నగదు, రెండు కార్లు, ఐదు మొబైల్ ఫోన్లు, 13 నంబరు ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా దేశంలో హవాలా డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడి వెలుతున్నాయో ముందుగా తెలుసుకుని ఆ మార్గంలో కాపుకాచి దారిదోపిడీకి పాల్పడుతూ వచ్చాయి. ఈ డబ్బు హవాలా కావడంతో ఫిర్యాదులు కూడా స్టేషన్లకు రాకపోవడంతో యథేచ్ఛగా వారి దోపిడీలను కొనసాగించారు. ఇటీవల దీనిపై రాప్తాడు పోలీసు స్టేషన్‌లో ఓ ఫిర్యాదు అందడంతో అనంత పోలీసులు దీనిపై లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ ముఠా కోసం 25 బృందాలను ఏర్పాటు చేసి, పక్క రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని దోపిడీ ముఠాను అరెస్టు చేశారు.

వార్త మెయిన్‌లో..

## ఏ పని అయినా మనసు పెట్టి చేయాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం**

మాట్లాడుతున్న డిఇఒ సాయిరాం

**ప్రజాశక్తి-అనంతపురం సిటీ**

మనం చేసే ఏ పని అయినా మనసు పెట్టి చేస్తేనే విజయం సాధించగలమని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష డిపిసి, ఎపిసి సాయిరాం పేర్కొన్నారు. శుక్రవారం నగర శివారు రాప్తాడు కేజీబీవీలో అనంతపురం జిల్లాలోని కేజీబీవీ ఎస్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈవో, సమగ్రశిక్ష డీపీసీ, ఏపీసీ సాయిరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల డి.హిరేహాల్ కేజీబీవీలో అగ్నిప్రమాదం జరిగిందని, అలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేజీబీవీల్లో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బై జ్యూస్ ట్యాబ్‌లను విద్యార్థులు, టీచర్లు వినియోగిస్తున్నారా? లేదా? అని ఎస్ఒలు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఏదైనా టెక్నికల్ సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించడానికి అమలు చేస్తున్న అనంత సంకల్పం కార్యక్రమాన్ని పక్కగా అమలు చేయాలని ఆదేశించారు. కేజీబీవీల్లో ఏమి జరిగినా ఎస్ఒలదే బాధ్యత అన్నారు. విద్యార్థుల వర్క్, నోట్ బుక్‌లను ఎప్పటికప్పుడు కరెక్షన్ చేయాలని, తప్పులుంటే సరిదిద్దడానికి టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో అనంతపురం జిల్లా వెనుక బడిందని, ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆర్ఒ వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రతి కేజీబీవీలో సిసి కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంట చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం ఏమైనా మీకు సమస్యలున్నాయా అని ఎస్ఒ లను అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డీఈవోకు ఎస్ఒలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎం హరిక్రిష్ణ, ఏపీవో నారాయణస్వామి, అసిస్టెంట్ సెక్టోరియల్స్ చంద్రమోహన్ రెడ్డి, మాధవరెడ్డి, తిప్పేస్వామి, రెబెకా, ఎస్ఒలు పాల్గొన్నారు.

**రాప్తాడు కేజీబీవీ తనిఖీ**

డీఈవో సాయిరాం శుక్రవారం మధ్యాహ్నం రాప్తాడు కేజీబీవీని తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులు బాగా చదువుతున్నారా అని ఆరా తీశారు. వంట గదికి వెళ్లి అక్కడ అన్నం తింటున్న విద్యార్థుల వద్దకు వెళ్లి భోజనం బాగుందా? లేదా? అని అడిగారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. వంట గదిని కూడా పరిశీలించి అక్కడ నిల్వ ఉన్న కూరగాయలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఒ ముత్యాలమ్మను అభినందించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయులపై అడుగడుగునా నిర్లక్ష్యం

అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

- ఎన్నికల హామీ ఏ ఒక్కటీ అమలు చేయని ప్రభుత్వం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైసిపికి లేదు
- పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి
- అనంతలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఉద్యోగులను అడుగడుగునా నిర్లక్ష్యానికి గురి చేశారని సిపిఎం, సిపిఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి అక్రమాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులపై అణచివేతను నిరసిస్తూ శుక్రవారం నాడు అనంతపురం టవర్‌క్లాక్ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, సి.జాఫర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి మూడున్నరేళ్లయినా దాని గురించి పట్టించుకోలేదన్నారు. సకాలంలో డిఎ చెల్లింపు, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ లాంటి హామీలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. ఉద్యోగ విరమణ అయిన వారికి అందాల్సిన పెన్షన్, గ్రాట్యుటీ లాంటివి సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పిఎఫ్ చెల్లింపుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒకటవ తేదీ వేతనాలు సక్రమంగా చెల్లించకుండా ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలు ఆందోళనకు సిద్ధపడగానే ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్బంధం, సంఘాల విచ్ఛిన్నం చేసే కుట్రలకు పూనుకుంటోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసిపి గెలవాలని చూస్తోందన్నారు. ప్రభుత్వం అనేక అక్రమాలు, బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడు తోందని చెప్పారు. హామీలను అమలు చేయకుండా మాట తప్పి, అడుగడుగునా నిర్బంధాలను కొనసాగిస్తున్న ఈ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి, పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఓ.నల్లప్ప, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకట నారాయణ, నగర కమిటీ సభ్యులు ప్రకాష్, మసూద్, వెంకటేష్, సిపిఐ నాయకులు రామాంజనేయులు, లింగమయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విజయవంతానికి పిలుపు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

తపాలా సేవకులు ఈనెల 15, 16 తేదీలలో దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత గ్రామీణ డాక్ సేవా సంఘం యూనియన్ నాయకులు బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయదుర్గం తపాలా సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ బ్యాంకు సేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ అనంతపురం, గుంతకల్ సబ్ డివిజన్ పరిధిలోని రాయదుర్గం తపాలా కార్యాలయం వద్ద రెండు రోజుల సమ్మెపై అవగాహన సదస్సు జరిగిందన్నారు. బ్రాంచ్ సహాయ కార్యదర్శి కామ్రేడ్ కిష్టప్ప మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీలలో రెండు రోజుల సమ్మెలో రాయదుర్గం సబ్ పోస్టాఫీస్ పరిధిలోని సభ్యులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.12, 24, 36, సీనియర్ ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలని, సబ్ స్టిట్యూట్ జీతాలు వెంటనే డ్రా చేయాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏడవ వేతన కమిటీలో అమలుకాని అంశాలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. అనంతరం సమ్మె సక్సెస్ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, కిష్టప్ప, బాబు నాయక్, శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, అనిల్, హసీనా, ఆంజనేయులు, రంజిత తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు..

**ఉరవకొండ :** క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ అన్నారు. శుక్రవారం విడపనకల్ మండల కేంద్రంలో విడపనకల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ పోటీ సాయి ఎలవెన్ చాబాల, అమిద్యాల జట్ల మధ్య జరిగింది. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో చాబాల జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా సిఐ శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా దేశాయి సిద్ధార్థ సహకారంతో క్రికెట్ పోటీలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ఈ క్రికెట్ పోటీలలో 60 టీములు పాల్గొన్నాయి. మొదటి బహుమతి చాబాల జట్టుకు రూ.25 వేలు, రెండవ బహుమతి అమిద్యాల జట్టుకు రూ.15 వేలు షీల్డ్‌లను సిఐ శేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు కనేకల్ చెన్నబసి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**ప్రజాశక్తి-అనంతపురం సిటీ**

ఆర్డీటీ అనంత క్రీడా గ్రామంలో ఈనెల 11 నుండి 13వ తేదీ వరకు ఇంటర్ జోన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమవుతాయని ఏపీ సాఫ్ట్‌బాల్ సీఈవో సి.వెంకటేసులు శుక్రవారం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలకు దేశంలోని సౌత్ జోన్, నార్త్ జోన్, ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ ల నుండి నాలుగు పురుషుల, నాలుగు మహిళల జట్లు పాల్గొంటాయన్నారు. శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్, ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు, ఆర్డీటీ ఛైర్మన్ తిప్పేస్వామి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో ప్రవీణ్ అనౌకర్, ట్రెజరర్ శ్రీకాంత్ తోరాట్, ఏపీ సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ఎన్.ఫణిభూషణ్, జిల్లా అధ్యక్షుడు సి.నాగేంద్ర హాజరవుతారన్నారు. సీఈవో సి.వెంకటేశులు మాట్లాడుతూ ఈ పోటీల్లో నాలుగు జోన్ల నుండి విజేతలైన నాలుగు పురుషుల, నాలుగు మహిళల జట్లు పాల్గొంటాయన్నారు. ఆర్డీటీలో అంతర్జాతీయ క్రీడా సదుపాయాలు ఉన్నందున సాఫ్ట్‌బాల్ ఇండియా వారు జాతీయ టోర్నమెంట్‌లను మనకు ఇస్తున్నారన్నారు. దేశంలోని అత్యుత్తమమైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు ఈ టోర్నమెంటులో పాల్గొంటారన్నారు. ఇలాంటి సదుపాయాలు కల్పించిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్‌కు ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రుణపడి ఉంటుందన్నారు. ఆర్డీటీతోపాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారం, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ఏపీలో ఈక్రీడ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఈ టోర్నమెంట్‌కు 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారని తెలియజేశారు.

నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

## బకాయిలు చెల్లించాలని నిరసన

**పుట్లూరు :** బకాయిలు చెల్లించాలని రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి తహశీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు సుమతి మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెయజేస్తామని చెప్పారు. ఈనెల 17, 20 తేదీలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఉద్యమానికి ఉద్యోగుల మద్దతు కోరుతామన్నారు. 21వ తేది నుంచి అన్ని కార్యాలయాల్లో వర్క్ టు రూల్ కొనసాగుతుందన్నారు. 27వ తేదీన కారుణ్య నియామకాలు కోసం వారి కుటుంబం సభ్యులను కలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు మల్లేష్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

**నార్పల :** నార్పల మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట కాలనీలో రోడ్డు విస్తరణ పనులను పంచాయతీ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ప్రధాన రోడ్డు గుంతలమయమై ఇరుకుగా ఉండడంతో రాకపోకలు సాగించడానికి కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. పంచాయతీ పాలకవర్గం స్పందించి రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చివేస్తున్నారు. రోడ్డుపై ఆక్రమణలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులను ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ అధికారి అశ్వర్థనాయుడు, పంచాయతీ సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

## నేడు గుంతకల్లులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గుంతకల్లు :** గుంతకల్లు పట్టణ, మండల పరిధిలో అన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్తు శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎ.రంగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని 33/11 కెవి సబ్‌స్టేషన్, మార్కెట్ యార్డ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మరమ్మతుల కారణంగా గుంతకల్లు మండలం, మునిసిపాలిటీ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## హెల్మెట్లపై అవగాహన

**గుమ్మగట్ట :** హెల్మెట్ ధరించడంపై ద్విచక్రవాహనదారులకు ఎస్ఐ సునీత శుక్రవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవాలని వాహనదారులకు సూచించారు. అతివేగం ప్రమాదానికి సూచకమన్నారు. తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్ ధరించి ప్రయాణించాలని తెలియజేశారు.

## విగ్రహ ప్రతిష్టాపన

**ఉరవకొండ :** విడపనకల్లు మండల పరిధిలోని పొలికి గ్రామ సరిహద్దులో ఎల్లమ్మదేవి అమ్మవారి రాతి విగ్రహాన్ని పున్ణప్రతిష్టించారు. అంతకుముందు గ్రామ వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి, పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు.

**CHANGE OF NAME**

Kaligar Abdul Khayyum (old name) son of khalaigar Abdulla Sahib # 15-1-31-13, Near Dbbidi Complex, Rayadurg Anantapur Dist 515865 have changed my name to **KHALAIGAR ABDUL KHAYYUM** (new name) vide affidavit dated 09-03-2023 sworn before notary by M.S.Harikrishna Rao Advocate, Rayadurg.

**In the Court of the Hon'ble District Judge: Ananthapuramu**

**G.W.O.P.No.25/2023**

**Between:**

గంటా చంద్రాయుడు ...పిటీషనర్

-NIL- ...రెస్పాండెంట్స్

**బహిరంగ నోటీసు**

తెలియచేయడమేమనగా అర్జీదారుడైన గంటా చంద్రాయుడు మైనర్ అయిన మేకల కృపకు గార్డియన్‌గా నియమించాలని కోరుతూ పై కోర్టు యెదుట పై అర్జీని దాఖలు చేసియుంటూ యున్నాడు. సదరు అర్జీ 27-03-2023 కు వాయిదా ఉంటూ ఉన్నది. అందువలన తెలుపుకోవడం ఏమనగా పై అర్జీకి సంబంధించి ఎవరికైనను ఏవైనా అభ్యంతరములు ఉన్నచో పై కోర్టు యెదుట ఉదయం 10.30 గంIIలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

అప్పా క్రిష్ణయ్య, ఎం.ఏ., ఎల్.ఎల్.బి.
టి.ధనుంజయ, బి.ఏ., బి.ఎల్.,
జి.జ్యోతి, బి.కాంమ్., ఎల్.ఎల్.బి.
పిటీషనర్ తరపు న్యాయవాదులు

**మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**

**Creditor I.P.No.24/2016**

**Between:**

చింబిలి విజయ ...పిటీషనర్

మరియు

ఇస్కాల నాగరత్నయ్య మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

**మొదటి ప్రతివాదికి నోటీసు**

To,

R1: ఇస్కాల నాగరత్నయ్య S/o ఐ.క్రిష్ణమూర్తి, డోర్‌నెం.13-551-4, అంభాభవానీ వీధి, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై దావాలో పిటీషనర్‌పై Creditor I.P.No.24/2016 ను దాఖలు చేసియున్నారు. సదరు దావా మొదటి ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 17-03-2023వ తేదిన వాయిదా వేసినారు. అందువలన తెలుపడము ఏమనగా పై తేదీన స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపకొనవలయును అని తెలుపడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

అప్పా క్రిష్ణయ్య, ఎం.ఏ., ఎల్.ఎల్.బి.
టి.ధనుంజయ, బి.ఏ., బి.ఎల్.,
వాదిపరం న్యాయవాదులు, తాడిపత్రి, గుత్తి.

# పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్ధులను గెలిపించండి

డి.హీరేహాల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-డి.హీరేహాల్**

పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు ఓటర్లను కోరారు. శుక్రవారం డి.హీరేహాల్ మండల కేంద్రంలో ఆయన సిఐటియు నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రజా గొంతుకలను చట్టసభలకు పంపిస్తే ప్రజల పక్షాన ప్రభుత్వాలను ప్రశ్నిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కమిటీ సభ్యులు లోకేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు నాయకులు ఓటర్లను కోరారు. శుక్రవారం బొమ్మనహాల్ మండల కేంద్రంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, కౌలు రైతు సంఘం అధ్యక్షులు బాలరంగయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నాయకులు ఓబులేసు, వాటర్‌వర్క్స్ నాయకులు నాగరాజు, చక్రి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రయివేటు పాఠశాలలు, విద్యుత్, ఐకెపి సిబ్బందిని కలిసి పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు.

**గుత్తి :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గుత్తిలో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఓటర్లను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. పశ్చిమ రాయలసీమ నియోజకవర్గానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు దుర్గమ్మ, సునీత, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

**శింగనమల :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓటర్లను కోరారు. శుక్రవారం వారు శింగనమల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, లక్ష్మీనారాయణరెడ్డి, కుళ్లాయప్ప, నాగయ్య, నాగేంద్ర, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్‌లో..

గుత్తిలో...

## విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు..

**ప్రజాశక్తి-నార్పల**

పదోతరగతి విద్యార్థులు రాత్రి వేళల్లో ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు వారి ఇంటి వద్దకు వెళ్తున్నారు. గురువారం రాత్రి నార్పల మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శోధనపల్లి, మంగపట్నం గ్రామాలకు వెళ్లారు. పదోతరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల భవిష్యత్తు పట్ల అవగాహన కల్పించారు. పిల్లలు చదువుకునే సమయంలో ఇంట్లో టీవీలు పెట్టకుండా సహకరించాలన్నారు. పదోతరగతిలో మంచి మార్కులు వస్తే ఇంటర్మీడియట్, డిగ్రీలో కూడా అదే స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జూటూరు షరీఫ్, శశికళ, నాగార్జున, కొండారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నిరసన

**శింగనమల :** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, సిపిఐ జిల్లా కమిటీ మెంబర్ చిన్నప్ప యాదవ్, కార్యవర్గ సభ్యులు నారాయణ స్వామి మాట్లాడుతూ.. సిపిఎస్ రద్దు చేయాలని, ప్రతి నెలా 1వ తేదీన జీతాలు ఇవ్వాలని, డిఎ బకాయిలను తక్షణమే చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలు చేయాలని, రిటైర్డ్‌మెంట్ అయి ఆరువారాలు దాటిన వెంటనే బెనిఫిట్స్ వారి ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, లక్ష్మీనారాయణరెడ్డి, కుళ్లాయప్ప, నాగయ్య, నాగేంద్ర, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు సరే.. మౌలిక వసతులేవి..?

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

పునాదులకే పరిమితమైన జగనన్న ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీల్లో మౌలిక వసతులు మృగ్యమవుతున్నాయి. కనీసం పునాదులు కూడా పూర్తికాని నిర్మాణాలు ఉన్నాయి. కొన్ని చోట్లయితే పట్టాలున్నాయి కానీ, స్థలాలు లేవని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఇళ్ల నిర్మాణాలు జరగడం లేదు. కనీసం గృహ నిర్మాణాలు చేపట్టాలంటే తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయలు లేవు. రహదారుల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు అరకొరగా జరిగినా.. మౌలిక సదుపాయాలు ఏవని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గృహ లబ్ధిదారులకు నివేశన పట్టాలను అందజేసి రెండేళ్లు గడుస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపకపోవడంతో గృహ నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే లబ్ధిదారుల నుండి స్థలాలను వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారు. ప్రతి నెలా సమావేశాలు, సభలు నిర్వహిస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇనుము, సిమెంట్, ఇసుక, ఇటుక రాయి వంటి మెటీరియల్‌ను లబ్దిదారులు చేర్చుకోవాలంటే అధిక వ్యయం వెచ్చిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# కష్టాల్లో ఉన్న వారికి సాయం చేయాలి

### విప్ కాపు రామచంద్రారెడ్డి

మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

సాటి మనిషి కష్టాల్లో ఉంటే వారికి సహాయ సహకారాలు అందించి ప్రేమతో చూడాలని రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ముస్లిం సామాజిక వర్గం గురు, శుక్రవారాలలో రాయదుర్గం పట్టణ పొలిమేరలో ఏర్పాటుచేసిన 'దీని ఇస్తెమా' ఆధ్యాత్మిక సదస్సుకు హాజరై ముస్లిం మత గురువులు పెద్దలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మంచి చేస్తే తమకు కూడా మంచి జరుగుతుందన్నారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించేందుకు ఇస్తెమాను నిర్వహించడం హర్షణీయం అన్నారు. వీటివల్ల ధార్మిక భావం బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముస్లిం మత గురువులు హాజరై సందేశాలు ఇవ్వడం అభినందనీయం అన్నారు. మత గురువులు మాట్లాడుతూ అల్లాహ్ ప్రసాదించిన జీవితం, ఖురాన్ లో చెప్పబడిన సందేశం గ్రహించినప్పుడే జీవితం ధన్యం అవుతుందన్నారు. ప్రతిరోజు ఐదు పూటలా నమాజ్ చేయాలని, రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష, పేదలకు జకాత్, ధనవంతుడు హజ్ మక్కాయాత్ర చేయాలన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మూఫ్తీ జైద్ సాబ్, మక్సు థాలం, మౌలానా రషీద్ ఆలం, అస్లాం, హఫీజ్, అల్తాఫ్, మంజూరు, అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ముతవల్లి బాషా, ఇస్మాయిల్ ముస్తాక్, హబీబ్ జాకీర్, రహంతుల్లా ముస్తఫా, ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా సబ్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఫకృద్దీన్, దాదు, మున్నా రాయదుర్గం, కళ్యాణదుర్గం, కనేకల్, కంబదూరు తదితర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# డ్రోన్‌తో పంటలపై మందులు పిచికారీ

డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

డ్రోన్ స్ప్రేయింగ్‌తో పంటలపై మందులు పిచికారీ చేస్తున్నట్లు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రెడ్డిపల్లె కెవికె ఆధ్వర్యంలో ధర్మవరం మండలం ఉప్పనేసినపల్లి గ్రామంలో 20 ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ, ఆముదం పంటలపై డ్రోన్ స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహించారు. పది నిమిషాల వ్యవధిలో ఒక ఎకరానికి స్ప్రేయింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టరు కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాధారణంగా నార్మల్ నాప్ సాక్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్‌లో వాడే స్ప్రే ఫ్లూయిడ్ కంటే డ్రోన్ స్ప్రేయర్ చాలా తక్కువగా నీటిని వాడుతుందన్నారు. డ్రోన్ నాజిల్ డ్రాప్ లెట్ సైజ్ సూక్ష్మంగా ఉండటం వల్ల పురుగు మందు ఎఫ్‌కెసి కూడా పెరుగుతుందన్నారు. చీని పంటలో ఎగిరే పేను ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించారు. పురుగు ఉధృతి తగ్గించడానికి ప్రారంభ దశలో ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయకుండా జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా సహజ శత్రువులైన అక్షింతల పురుగు ద్వారా తగ్గించాలని తెలిపారు. మొదటిసారి రసాయన పురుగు మందులైన డైమీతో ఎట్ 2 మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీలీటర్లు ఒకసారి పిచికారీ చేయాలని తెలిపారు. ఎక్కువగా ఉన్నప్పుడు నోవాలిరాన్ 0.8 మిల్లీలీటర్లు లేదా థయామితాగ్జామ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంటి డైరక్టర్ డాక్టర్ కమల, రైతులు రవి ప్రకాష్, రామకృష్ణారెడ్డి, బయన్న, అశోక్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పప్పుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఏపీ మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పృధ్వీసాగర్ మాట్లాడుతూ బెలుగుప్ప, ఆవులెన్న సొసైటీల ద్వారా రైతులు పండించిన పప్పుశనగను కనీస మద్దతు ధర రూ.5335కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. బెలుగుప్ప సొసైటీ ద్వారా శ్రీరంగాపురం, బెలుగుప్ప, గుండ్లపల్లి, తగ్గుపర్తి, ఆవులెన్న, ఎర్రగుడి గ్రామాల నుండి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆవులెన్న సొసైటీ ద్వారా సిర్పి, గంగవరం, దుద్దేకుంట, అంకంపల్లి, కోనంపల్లి, బి.రాంసాగరం రైతుల నుండి పప్పుశనగ కొనుగోలు చేస్తామన్నారు. ఆవులెన్న సొసైటీ వారు తమ గోడౌన్‌ను దుద్దేకుంట గ్రామంలో, బెలుగుప్ప సొసైటీ వారు బెలుగుప్ప సొసైటీ కార్యాలయంలో గోడౌన్‌ను ఏర్పాటు చేశారన్నారు. పప్పుశనగ అమ్మదలచిన రైతులు వారి పేర్లను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెలుగుప్ప సొసైటీ సీఈవో పాండు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది శిల్ప, ఎంపిఇఓ పవన్ కుమార్, తిమ్మారెడ్డి, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

### పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

ఆత్మకూరు మండల కేంద్రంలో ఆవుల కొండారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తోటకు వెళ్లే మార్గంలో 11 కెవి విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడడానికి సిద్ధంగా ఉండడంతో రైతులు బిక్కుబిక్కుమంటూ తోట వద్దకు వెళ్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నామని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యుత్ స్తంభం విరిగిపడి తీగలు నేలమీద పడడంతో ఓ రైతు మృతి చెందాడని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

**ఉరవకొండ :** గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కొట్టాలపల్లి వైద్యాధికారి హరినాథ్ రెడ్డి సూచించారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా విడపనకల్లు మండల పరిధిలోని కొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా. కె.హరినాథ్ రెడ్డి,డా. జి.శ్రీ కాంత్ బాబు ఆధ్వర్యంలో 33 మంది గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా.హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. గర్భం నిర్ధాణ అయిన వెంటనే సమీప ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. నెల నెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య సంరక్షణ చేసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. ఆసుపత్రిలోనే కాన్పు జరిగేలా ప్రసవ ప్రణాళిక చేసుకోవాలన్నారు. సకాలంలో అవసరమైన ఇంజక్షన్లు వేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన బావి కాటి రంగప్ప మెమోరియల్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనం వసతి కల్పించారు. ఎంపిహెచ్ఇఓ తిరుపాలనాయక్, సూపర్‌వైజర్ నాగశంకర్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, శివరామక్రిష్ణ, సూపర్‌వైజర్ డీవీఎల్ పద్మకుమారి, ఫార్మసిస్ట్ దుర్గ, ఎఎన్ఎంలు అనుసూయ పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## ద్విచక్రవాహనాల దొంగలు అరెస్టు

### 23 బైకులు స్వాధీనం

**ప్రజాశక్తి పెద్దవడుగూరు**

ద్విచక్రవాహనాల దొంగలను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 23 బైకులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పెద్దవడుగూరు పోలీసు స్టేషన్‌లో తాడిపత్రి డీఎస్పీ విఎన్‌కె చైతన్య, పామిడి గ్రామీణ సీఐ రామకృష్ణ, ఎస్ఐ రాజశేఖరరెడ్డి విలేకరులకు వివరాలను వెల్లడించారు. మండలంలోని గుత్తిఅనంతపురం సమీపంలో ఉన్న సుంకులమ్మ దేవాలయం ఆవరణంలో జాతర సందర్భంగా గత మాసంలో పలు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు పోలీసులు విచారణ చేపట్టి చోరీకి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి వాహనాల వివరాలను రాబట్టారు. పెద్దవడుగూరు మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన మంగల రామమోహన్, వెంకటాంపల్లికి చెందిన నాగేశ్వరరావు, వడ్డె శ్రీనివాసులు, ఎ.ఎ.మహమ్మద్, జోయల్డేక్ అనే వ్యక్తులు ఒకగ్రూప్‌గా ఏర్పడి డోన్, తాడిపత్రి, కర్నూలు, ఉరవకొండ, అనంతపురం ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగిలించేవారన్నారు. గుత్తిలోని ఒక కంప్యూటర్ కేంద్రంలో డూప్లికేట్ ఆర్సీలను తయారుచేసి వాటిని విక్రయించే వారన్నారు. పోలీసు సిబ్బంది దొంగతనం కేసును ఛేధించి 23 ద్విచక్రవాహనాలను, ఏడు డూప్లికేట్ ఆర్సీలు, కంప్యూటర్, మానిటర్‌ను స్వాధీనం చేసుకుని నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చెప్పారు. దొంగతనం కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డిఎస్‌పి చైతన్య అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దవడుగూరు మండలం అప్పచెర్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో గుత్తిలో భవన నిర్మాణ పనులు అనంతరం భోజనానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. జక్కలచెరువు గ్రామం వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

## పశుగ్రాసం దగ్ధం

**ప్రజాశక్తి -పెద్దవడుగూరు**

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాంస దగ్ధమైన సంఘటన పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మల్లేనిపల్లి గ్రామానికి చెందిన రైతు రంగనాయకులు ఇతర రైతుల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేసి దాన్ని ట్రాక్టర్‌లో వేసుకుని బయలుదేరాడు. మల్లేనిపల్లి గ్రామ సమీపంలో గ్రాసానికి విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. వాటిని ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ట్రాక్టర్‌లోని ఐదుగురు కూలీలకు స్వల్ప గాయాలు అయ్యాయి. రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

## డీవార్మింగ్ డేపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-నార్పల**

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 14వ తేది నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, జూనియర్ కళాశాల, అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 14వ తేది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. 11,950 మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, సిడిపిఒ భారతి, ఎంఇఒ కృష్ణయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వాణి, సిహెచ్ఒ పుల్లయ్య, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పుట్లూరు :** డీవార్మింగ్ డైపై స్థానిక మోడల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 14వ తేదీ 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలచేత ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు.
5557 అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, మెడికల్ ఆఫీసర్ హిమబిందు, ఎంఇఒ నాగరాజు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నులి పురురుగుల నూర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మలేరియా అధికారి డాక్టర్ ఓబులు, డాక్టర్ వినోద్ కుమార్, ఎంఇఒ గురుప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, సిహెచ్ఒ మోహన్‌రావు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా, ఎంపీడీవో విజయేంద్ర ప్రసాద్, ఎంఇఒ నరసింహారెడ్డి, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, సిహెచ్ఒ చంద్రావతి, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు

## ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

**ప్రజాశక్తి-గుమ్మగట్ట**

గుమ్మగట్ట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను ఆర్డీవో నిశాంత్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గదులలో విధుల నిర్వహణకు కావలసిన సామగ్రి, విద్యుత్ కనెక్షన్, నీటి వసతి తదితర అంశాలను పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు కల్పించాలని స్థానిక ఎస్ఐ సునీతను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దారు నరేష్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు వీరేష్, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ సైకిల్‌యాత్ర

**ప్రజాశక్తి- పెద్దవడుగూరు**

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ దివ్యాంగుడైన నీల ప్రసాద్ సైకిలుయాత్ర చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బోరగాం గ్రామానికి చెందిన నీలప్రసాద్ ఇచ్చాపురం నుంచి అనంతపురానికి చేపట్టి ట్రై సైకిలు యాత్ర శుక్రవారం పెద్దవడుగూరు మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రకు ప్రత్యేకహోదా ఇవ్వాలని, విశాఖకు రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సైకిలుయాత్ర చేపట్టానన్నారు. ఇప్పటి వరకు 12 జిల్లాలోని 200 మండలాల్లో యాత్ర కొనసాగించినట్లు చెప్పారు. అనంతపురంతో ఈయాత్ర ముగుస్తుందని అన్నారు. ఈసందర్భంగా మండల తహశీల్దారు ఈరమ్మ, ఎంపీడీవో కుల్లాయిస్వామి, ఉప తహశీల్దారు శ్రీరాములు, ఎపిఒ జయరాంరెడ్డి, సీనియర్ సహాయకురాలు రమాదేవి, వీఆర్వోలు కుళ్లాయిస్వామి, సుంకన్న, బహుజన సమాజ్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి నగేష్ తదితరులు నీల ప్రసాద్‌కు ఆర్థిక సహకారం అందించి అభినందించారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం